

పోలీసుల దాడిలో గాయపడిన ఆశ కార్యకర్తను ఉస్మానియా దవాఖానలో పరామర్శిస్తున్న శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



ఉస్మానియా దవాఖానలో ఆశ కార్యకర్తలను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు మహమూద్అలీ, సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, సీనియర్ నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేవీప్రసాద్ తదితరులు

## లోకం పోకడ



సారుకు విద్యార్థుల గురించి ఆలోచించే తీరిక ఎక్కడిదయ్యా? విగ్రహాల తయారీ చర్చలో బిజీగా వున్నారు...కలవడం కుదరదు!

# బహుజన తల్లికి బంగారం ఉండొద్దా?

మొదటిపేజీ తరువాయి...

సేకరించాలని, వందశాతం పూర్తయితే తాను రాజకీయాల నుంచి తప్పుకొంటానని స్పష్టంచేశారు. ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి రైతులను, ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. అలవికాని హామీలు ఇచ్చి.. అరకొర రుణమాఫీ చేసి వందశాతం పూర్తయినట్టు గొప్పలు చెప్పుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి ఏడాది పాలనకు సున్నా మార్కులు కూడా రావని, చరిత్రలో అసమర్థ సీఎంగా ఆయన మిగిలిపోతారని ఎద్దేవాచేశారు. ప్రభుత్వాన్ని నడపే సత్తా లేకనే బీఆర్ఎస్ చేసిన పనులను తమ ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శించారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద గూగుల్ క్యాంపస్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌కు తీసుకొస్తే, రేవంత్‌రెడ్డి మాత్రం గూగుల్‌ను తామే తీసుకొచ్చామని చెప్పుకొంటున్నారని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు అప్పటి ప్రభుత్వం నిర్మించిన ఎస్టీపీలను ప్రారంభించి తామే కట్టినట్టు చెప్పుకొంటున్నారని ఆక్షేపించారు. కుక్కకాటుకు చెప్పుదెబ్బ తరహాలో రేవంత్‌రెడ్డి మాటలకు బదులిస్తామని స్పష్టంచేశారు. ఢిల్లీలో అదానీ-మోదీ దోస్తీపై రాహుల్ గాంధీ నిరసన తెలుపుతుంటే, తెలంగాణలో రేవంత్‌రెడ్డి అదానీతో వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ మాటను రేవంత్‌రెడ్డి లెక్కచేయడం లేదని చెప్పారు. మంగళవారం ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్‌పై కేటీఆర్ నిప్పులు చెరిగారు.

### ఏ తల్లికీ లేని జీవో తెలంగాణ తల్లికా?

'జీవోలతో తల్లి రూపాన్ని మారుస్తారా? భరత మాత, తెలుగుతల్లి, కన్నడతల్లిని ఆవిష్కరించినప్పుడు ఏ జీవో జారీ చేశారు? ఏ తల్లికీ లేని జీవో తెలంగాణ తల్లికి ఎలా వర్తిస్తుంది?' అని కేటీఆర్ నిలదీశారు. 20 ఏండ్లుగా ప్రతి పల్లెలో తెలంగాణ తల్లిని ప్రజలు నిలుపుకొన్నారని, ప్రజల గుండెల్లో ముద్రించుకున్న తెలంగాణ తల్లి రూపాన్ని జీవోలతో చెరిపేస్తారా? అని ప్రశ్నించారు. అమరవీరుల స్మారకమైన అమరజ్యోతి ప్రాంగణంలో తెలంగాణ తల్లిని కేసీఆర్ అధికారికంగా ఆవిష్కరించారని కేటీఆర్ స్పష్టంచేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాగణంలో హరీశ్‌రావు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారని గుర్తుచేశారు. తెలంగాణ తల్లి రూపు రేఖలను మార్చి రాష్ట్ర అస్తిత్వాన్ని మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ తల్లిని, రాజీవ్ విగ్రహాన్ని రాచమర్యాదలతో గాంధీభవన్‌కు తరలిస్తామని చెప్పారు.

### తెలంగాణ అస్తిత్వంపై దాడి..

ఏడాది పాలనలో పేర్లు మార్చే పనులు తప్ప పేదల బతుకులను మార్చే పనిని కాంగ్రెస్ సర్కార్ ఏమాత్రం చేయలేదని కేటీఆర్ విమర్శించారు. జయజయహే తెలంగాణ గేయంలో కాకతీయ కళాతోరణం, రామప్ప అనే పదాలను తొలగించారని, రాష్ట్ర చిహ్నంలోని కాకతీయ కళాతోరణం, చార్మినార్లను తొలగించారని, పేర్లు, విగ్రహాలను మారుస్తూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే పేర్లు మారుస్తూపోతే తాము అధికారంలోకి రాగానే వాటన్నింటినీ తొలగిస్తామని స్పష్టంచేశారు. వాటి స్థానంలో తెలంగాణ ఉద్యమకారులు, మేధావుల పేర్లను పెడతామని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పేర్లు, విగ్రహాల మార్పులకు పాల్పడలేదని, ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి మేధావుల విగ్రహాలను ఆవిష్కరించామని గుర్తుచేశారు.



ఉస్మానియా దవాఖాన సిబ్బంది బాధలను అడిగి తెలుసుకుంటున్న కేటీఆర్

### పాలన కాదు పీడన!

*ప్రజల వేదన..అరణ్యా రోదన!*
*రైతుల చెరబడితిరి!*
*పేదల ఇండ్లు కూలగొడ్తిరి!*
*రైతుబంధు ఎత్తేస్తిరి!*
*రైతుబీమాకు పాతరేస్తిరి!*
*కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ మాయం చేస్తిరి!*
*అమ్మ ఒడిని ఆగం చేస్తిరి!*
*నిరుద్యోగుల ఉసురు పోసుకుంటిరి!*
*ఏక్ పోలీస్ అన్న పోలీసులను అణగదొక్కితిరి!*
*హామీల అమలు అడిగిన ఆడబిడ్డలు*
*ఆశాలను అవమానపరిస్తిరి!*
*టీఎస్‌ను టీజీగా చేసి చార్మినార్,*
*కాకతీయ కళాతోరణాలను తొలగిస్తిరి!*
*తెలంగాణ బిడ్డలు లాఠీలకు, తూటాలకు*
*ఎదురొడ్డి.. ఆత్మబలిదానాలతో*
*ఉద్యమిస్తున్నప్పుడు..*
*సమైక్యవాదుల పంచనచేరి వంచన చేస్తిరి!*
*అధికార అహంకారంతో*
*ఇప్పుడు ఏకంగా అమ్మనే మారిస్తిరి!*
*మీరు చరిత్రను చెరిపేస్తాం అన్న భ్రమలో..*
*తెలంగాణ ప్రజలను ఏమారుస్తాం*
*అనుకుంటే పొరపాటే!*
*తెలంగాణ అన్నీ గమనిస్తున్నది*
*కాలంబు రాగానే కాటేసి తీరుతది!*
*జై తెలంగాణ!!*

> **తెలంగాణ తల్లి రూపు రేఖలు మార్చి రాష్ట్ర సాంస్కృతిక అస్తిత్వాన్నే చెరిపేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. తెలంగాణ తల్లులు బీదగా ఉండాలని కోరుకుంటున్నది. బహుజన తల్లులకు బంగారం ఉండొద్దని నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. పేదరికం అనివార్యం కానీ ఆదర్శం కాదు.. కిరీటం మిగతా తల్లులకు ఉండాలిగాని తెలంగాణ తల్లికి ఉండొద్దా? కాంగ్రెస్ తల్లి కాళ్ల కింద బిగిసిన పిడికిళ్లను పెట్టి ఉద్యమకారులను అవమానించిండ్రు.**
> **-కేటీఆర్**

### కష్టపడే నాయకులకు అండగా ఉంటాం..

చిన్న స్థాయి కార్యకర్తలకు పదవులిచ్చి ఎమ్మెల్యేలు, మంత్రులను చేస్తే కొందరు పార్టీ ఫిరాయించారని కేటీఆర్ చెప్పారు. 'కుండ పగిలితే పగిలింది కానీ కుక్కబుద్ధి తెలిసింది అన్న చందంగా వారి వ్యవహార శైలి ఉన్నది' అని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్‌లో ఆటుపోట్లు ఎదుర్కొంటూ కష్టపడి పనిచేసేవారికి అండగా ఉంటామని స్పష్టంచేశారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవారికే పదవులు దక్కుతాయని తేల్చిచెప్పారు. ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని, భవిష్యత్తులో ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకోబోమని స్పష్టంచేశారు. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా దివాలా కోరు రాజకీయం చేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ వల్లే రాష్ట్రంలో పంటలు పండుతున్నాయని భ్రమ పడుతున్నారని, తెలంగాణకు నీటిని, కరెంటును తెచ్చి వ్యవసాయ స్థిరీకరణ చేసిందే కేసీఆర్ అని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. దాని ఫలితంగానే ఇప్పు డు రికార్డు స్థాయిలో పంటలు పండుతున్నాయని వివరించారు.

### ఇదేం వంచన రాహుల్‌జీ?

పార్లమెంట్‌లో అదానీ-మోదీ ఉన్న టీషర్ట్ ధరిస్తే తప్పు కానప్పుడు, తెలంగాణ అసెంబ్లీలో అదానీ-రేవంత్ వ్యవహారాన్ని బయటపెట్టేందుకు తమకు అనుమతి ఎందుకు లేదని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. అదానీ వ్యతిరేక నిరసనల్లో కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నదని మండిపడ్డారు. పార్లమెంట్‌లో ఒకలా, తెలంగాణలో మరోలా వ్యవహరిస్తున్నారని నిప్పులు చెరిగారు.

### ఎస్ఎం కృష్ణ మృతికి కేటీఆర్ సంతాపం

కర్నాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ మృతికి కేటీఆర్ సంతాపం తెలిపారు. బెంగళూరును దేశంలోనే టెక్‌హబ్‌గా మార్చి సాంకేతిక ప్రభుత్వానికి నాయకత్వం వహించిన ఘనుడు ఎస్ఎం కృష్ణ అని కొనియాడారు. ఆయన మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. ఎస్ఎం కృష్ణ కుటుంబానికి సానుభూతి తెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

### 'ఎమ్మెల్యేల ఓరియంటేషన్' బహిష్కరణ

శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ తీరుకు నిరసనగా నేటి నుంచి జరిగే శాసనసభ్యుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని బహిష్కరించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటన విడుదల చేశారు. శాసనసభ ప్రారంభానికి ముందే స్పీకర్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించారని, తొలి రోజే బీఆర్ఎస్ శాసనసభ్యులు సభలోకి రాకుండా పోలీసులను మోహరించి అరెస్టు చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజా సమస్యలను ఎత్తిచూపేందుకు నిరసన తెలిపితే అరెస్టు చేశారని వివరించారు. బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై తగిన చర్యలు తీసుకోవాలని, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి, ఫిరాయింపులను నిరోధించేందుకు తగిన నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. గత శాసనసభ సమావేశాల్లో కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, ఎమ్మెల్యేల గొంతు నొక్కేలా వ్యవహరించారని తెలిపారు. ఈసారి ఎన్నికైన శాసనసభ్యుల్లో బీఆర్ఎస్‌లో అతి తక్కువ మంది కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ఉన్నారని, స్పీకర్ ఏకపక్ష తీరుకు నిరసనగా బుధవారం నుంచి జరిగే శాసనసభ్యుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు వెల్లడించారు. ఇప్పటికైనా స్పీకర్ పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

### ప్రజల వేదన.. అరణ్య రోదన

రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పాలనలో ఎక్కడ చూసినా ప్రజల వేదన.. అరణ్య రోదనే కనిపిస్తున్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. పథకాలకు పాతరేసి సకల వర్గాల ప్రజలను వేధిస్తున్నారని వాపోయారు. అధికార అహంకారంతో ఏకంగా అమ్మనే మార్చారంటూ మండిడ్డారు. రేవంత్ పాలనపై ఎక్స్ వేదికగా సెటైరికల్ ట్వీట్ చేశారు.

## ఆడబిడ్డలపై దుశ్శాసన పర్వం

- **ఆశ కార్యకర్తల హామీలు నెరవేర్చాలి**
- **వారి సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తం**
- **ఎన్‌హెచ్చార్సీకి ఫిర్యాదు చేస్తం : కేటీఆర్**
- **పోలీసుల దాడిలో గాయపడిన ఆశ కార్యకర్తలకు దవాఖానలో పరామర్శ**

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తేతెలంగాణ): ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అడిగిన ఆశ కార్యకర్తలపై కాంగ్రెస్ ప్రభుత్వం దుశ్శాసన పర్వానికి దిగడం దుర్మార్గమని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. పోలీసుల దాడిలో గాయపడి ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతున్న ఆశ కార్యకర్తలను మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, సీనియర్ నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేవీప్రసాద్ తదితరులతో కలిసి మంగళవారం పరామర్శించారు. తీవ్రంగా గాయపడ్డ రహీమాబీ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం వేరే దవాఖానలో చేర్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం ఆదేశాలతోనే పోలీసులు మహిళలపై ఇష్టారీతిన దాడులు చేశారని విమర్శించారు. ఈ ఘటనను చూసి తెలంగాణ సమాజం సిగ్గుపడుతున్నా, హోంమంత్రిత్వ శాఖను దగ్గరపెట్టుకున్న ముఖ్యమంత్రి మాత్రం స్పందించకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన ఆశ కార్యకర్తలపై దాష్టీకానికి దిగడం దుర్మార్గమని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే వేతనం పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించడం కాంగ్రెస్‌కే చెల్లిందని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి పేరుతో కాంగ్రెస్ తల్లిని ప్రతిష్ఠించిన రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లులపై దాడులకు దిగడం హేయనీయమని, వారి అధినేత్రి సోనియా పుట్టినరోజు నాడే పోలీసులతో దాడులు చేయించడం బాధాకరమని పేర్కొన్నారు. ఏసీపీ, సీఐలు ఆశ కార్యకర్త చీరను లాగేయడం, వ్యాన్లలో ఎక్కించి హింసించడం చూసి రాష్ట్రంలోని ఆడబిడ్డలందరూ కలతచెందారని చెప్పారు. ఈ ఘటనపై అసెంబ్లీ సమావేశాల్లో సర్కార్‌ను నిలదీస్తామని స్పష్టంచేశారు. త్వరలోనే సీసీ పుటేజీలు, వీడియో ఆధారాలతో ఢిల్లీకి వెళ్లి జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

> **రేవంత్‌రెడ్డిని ఈ రాష్ట్రంలో ఎవరూ పట్టించుకుంటలేరు. ఏ సినిమా యాక్టర్లకు బెనిఫిట్ షోలు ఇచ్చిండో వాళ్లకు ఈయన పేరు కూడా గుర్తుంటలేదు.. ఆయన ముఖ్యమంత్రి అని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా గుర్తిస్తలేదు. కేవలం బ్యాగులు మోసే బ్యాగ్‌మ్యాన్‌లా చూస్తున్నది.**
> **-కేటీఆర్**



తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కరీంనగర్ జడ్పీ మాజీ అధ్యక్షురాలు తుల ఉమ

## మహిళలంటే రేవంత్‌కు గౌరవం లేదు

**లగచర్ల రైతులు, ఆశ కార్యకర్తలపై దాడులే నిదర్శనం**
**తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన రోజునే దాష్టీకం**
**పోలీసుల దమనకాండపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశాం**
**జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ**

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తేతెలంగాణ): 'మహిళలంటే రేవంత్ సర్కారుకు ఏమాత్రం గౌరవం లేదు.. ఇటీవల లగచర్లలో గిరిజన మహిళా రైతులు, మొన్న ఆశ కార్యకర్తలపై భౌతికదాడులే ఇందుకు నిదర్శనం' అని కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ మండిపడ్డారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన రోజే కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ కార్యకర్తలపై పోలీసులతో దాడి చేయించిందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. హామీలను నెరవేర్చాలని కోఠిలోని మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసు ఎదుట శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలపై పోలీసుల దమనకాండ దుర్మార్గమని పేర్కొన్నారు. ఘటనపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. మహిళా నాయకురాలు సుమిత్ర ఆనంద్ తనోబా మాట్లాడుతూ రేవంత్ ప్రభుత్వం మహిళలపై మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నదని ఆరోపించారు. పోలీసుల దాడిలో గాయపడ్డ ఆశ కార్యకర్తలను సకాలంలో దవాఖానకు తరలించకపోవటం దుర్మార్గమని మండిపడ్డారు. ఆశ కార్యకర్తలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సుశీలారెడ్డి, అర్పితా ప్రకాశ్, కీర్తిలతాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దౌర్జన్యంగా ఐఫోన్ లాక్కెళ్లారు

**ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్**
**పోలీసుల వివరణ కోరిన హైకోర్టు**



హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): మాసబ్‌ట్యాంక్ పోలీసుల జులుంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో మంగళవారం అత్యవసర లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఓ కేసు విచారణలో భాగంగా ఇటీవల దాదాపు 50 మంది పోలీసులు దౌర్జన్యంగా తన ఇంట్లోకి చొరబడి బలవంతంగా ఐఫోన్‌ను లాక్కెళ్లారని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ ఫోన్‌ను తిరిగి ఇప్పించేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై వివరణ ఇవ్వాలని పోలీసులను ఆదేశించిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి.. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

## తెలంగాణ తల్లి కాదు.. కాంగ్రెస్ తల్లి

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**



దేవరుప్పుల, డిసెంబర్ 10: ప్రభుత్వం ఆవిష్కరించిన విగ్రహం కాంగ్రెస్ తల్లి దని, తెలంగాణ తల్లి అనడం రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. వట్టికోట ఆళ్వార్‌స్వామి, దాశరథి తెలంగాణ తల్లి ప్రతి రూపాన్ని తమ కవితలు, రచనల్లో తెలిపారని చెప్పారు. దానికి అనుగుణంగా ఉద్యమనేత కేసీఆర్‌తోపాటు, ఉద్యమకారులు, కవులు, రచయితలు, కళాకారులు సమన్వయంతో తెలంగాణతల్లికి రూపకల్పన చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ గుర్తుతో రూపొందించిన ఆ తల్లి తెలంగాణ ప్రజలకు మింగుడుపడదని చెప్పారు. సంస్కృతీసంప్రదాయాలకు జీవోలు ఉండవని స్పష్టం చేశారు.

# పట్టువీడని ఆశాలు

- **ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ముట్టడి**
- **వేతనం 18వేలకు పెంచాలని నిరసనలు**
- **భారీగా మోహరించి అడ్డుకున్న పోలీసులు**
- **హైదరాబాద్‌కు రాకుండా అరెస్టులు**
- **శాంతిభద్రతలకు భంగం కలిగితే ఊరుకోం: మంత్రి దామోదర రాజనర్సింహ**
- **ఆశాల సమస్యలను పరిష్కరిస్తాం: కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్లు**
- **మహిళా కమిషన్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు**



భారీ సంఖ్యలో తరలివచ్చి హైదరాబాద్ కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించిన ఆశ కార్యకర్తలు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ)/సుల్తాన్‌బజార్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వేతనం రూ.18 వేలకు పెంచడంపై ఆశాకార్యకర్తలు పట్టువీడటం లేదు. అరెస్టులు, బెదిరింపులతో ప్రభుత్వం అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నా తమ పోరాటాన్ని ఆపడం లేదు. మంగళవారం మరోసారి వందల మంది ఆశా కార్యకర్తలు హైదరాబాద్ కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమ వేతనాన్ని పెంచాల్సిందేనని డిమాండ్ చేశారు. సోమవారం ఆశా కార్యాకర్తలపై పోలీసులు చేసిన దాడిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఆశాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం విశ్వప్రయత్నం చేసింది. వారు హైదరాబాద్‌కు రాకుండా ఎక్కడికక్కడ జిల్లాల్లో అరెస్టులు చేశారు. హైదరాబాద్‌ని కోఠి ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఆవరణలోనూ పోలీసులు మోహరించారు. సోమవారం నాటి ఘటన నేపథ్యంలో మంగళవారం ఎక్కువగా మహిళా పోలీసులను మోహరించారు. ఆశాలు రాగానే నిర్బంధించారు. కొందరిని మాత్రమే ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను కలిసేందుకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పీ జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. తమను ప్రభుత్వం మోసం చేస్తున్నదని, హామీలను అమలుచేయాలని కోరినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. పోలీసులు తమతో అసభ్యంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో యూనియన్ ప్రతినిధుల చర్చలు సఫలమైనట్టు జయలక్ష్మి తెలిపారు. ధర్నాకు తరలివచ్చిన ఆశా వర్కర్లు కొందరు రోడ్డుపై బైఠాయించగా వారిని కార్యాలయ ఆవరణకు తరలించేందుకు పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎంతకీ అంగీకరించక పోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొన్నది. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేశ్, హైదరాబాద్ సెంట్రల్ కార్యదర్శి ఎం వెంకటేష్, హైదరాబాద్ సౌత్ అధ్యక్షురాలు ఎం మీనా, రాష్ట్ర నాయకులు యాదమ్మ, పద్మ, కే సునీత, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ఆశా వర్కర్లను రెచ్చగొట్టారు

ప్రభుత్వం ఆశా వర్కర్ల స్వేచ్ఛను గౌరవిస్తుందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. అయితే, శాంతిభద్రతలకు భంగం కలిగితే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఆశాల ఆందోళనలపై మంగళవారం ఆయన స్పందించారు. విజయోత్సవాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రతిపక్షాలు ఆశా వర్కర్లను రెచ్చగొట్టాయని ఆరోపించారు. ఆశాలు సంయమనంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. సొమ్మసిల్లిన ఆశా వర్కర్ రహీంబీకీ ఉస్మానియా దవాఖానలో మెరుగైన చికిత్స అందించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

### వేతనంపై ప్రతిపాదనలు సిద్ధం..

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ 18 వేల వేతనంపై ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్లు రాజేశం, కృష్ణవేణి తెలిపారు. ప్రతి ఆదివారం, పండుగ సెలవులను అమలుచేస్తామన్నారు. లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు త్వరలోనే చెల్లిస్తామని హామీఇచ్చారు. ఆశాలకు సెలవులు కావాలంటే ఏఎన్ఎంలకు చెప్పి తీసుకోవచ్చని సూచించారు.

### జిల్లాల్లో ఆశాల నిర్బంధం..

హైదరాబాద్‌లోని ధర్నాకు తరలివెళ్లకుండా నల్లగొండ, రాజన్నసిరిసిల్ల, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. నల్లగొండ జిల్లాలోని అన్ని మండలాల్లో ఆశా వర్కర్లపై పోలీసుల నిర్బంధకాండ కొనసాగింది. వీరి అక్రమ అరెస్టులను సీఐటీయూ ఖండించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పోలీసులు ఆశా వర్కర్లను అరెస్టుచేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల నుంచి సిరిసిల్ల మీదుగా బయల్దేరిన వారిని శివారులోనే అదుపులోకి తీసుకున్నారు. సిరిసిల్లలో సుమారు 25 మందిని అరెస్టుచేశారు. వేములవాడలోనూ అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత వ్యక్తిగత పూచీపై వదిలిపెట్టారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో 31 మందిని అరెస్ట్ చేశారు. గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జగిత్యాలలో అరెస్టైన ఆశాలను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పరామర్శించారు. మల్యాలో అరెస్టైన ఆశాలను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. కారేపల్లి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆశాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వర్‌రావు సంఘీభావం తెలిపారు. అశ్వారావుపేట నుంచి బయల్దేరిన ఆశాలను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆదిలాబాద్ బస్టాండ్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే యత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ.. ముందస్తు అరెస్టులు సరికాదన్నారు. ఆశా వర్కర్లపై పోలీసుల లాఠీచార్జి అమానుషమని, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆయన మాట్లాడుతూ.. ఆశవర్కర్లు తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తే దాడులు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఆశావర్కర్లు అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## రాష్ట్ర మహిళా కమిషన్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

**హక్కుల** సాధనకు హైదరాబాద్‌లోని కోఠి మెడికల్ అండ్ హెల్త్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలపై పోలీసులు దాడి ఘటనపై జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ నేతృత్వంలో బీఆర్ఎస్ మహిళా నేతలు మంగళవారం మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మగ పోలీసులు ఇష్టానుసారంగా దూషిస్తూ మహిళలపై క్రూరమైన దాడికి పాల్పడ్డారని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. మాట్లాడలేని భాషలో దుర్భాషలాడారని, ముఖ్యంగా ఏసీపీ శంకర్, సీఐ శ్రీనివాస్ ఆశా కార్యకర్తల వస్త్రాలను లాగి, వ్యాన్లలో ఎత్తివేసిన విషయాన్ని ఫిర్యాదులో ప్రస్తావించారు. దాడి దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమై ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనపై మహిళా కమిషన్ సమగ్రంగా విచారించి ఏసీపీ శంకర్, సీఐ శ్రీనివాస్‌తోపాటు పోలీసులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ మహిళా నాయకులు సుశీలారెడ్డి, అర్పితాప్రకాశ్, కీర్తిలతాగౌడ్ తదితరులు ఉన్నారు.